క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



తాడికొండ: ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని వెలగపూడిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఏపీ హైకోర్టు వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం ఉండదన్నారు. పరిమిత వేగంతో వాహనాలను నడిపి సురక్షితంగా ఇళ్లకు చేరాలని కోరారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

7న జీవధ్వజ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట



ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కాశీ విశాలాక్షీసమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 7న జీవధ్వజ, నవగ్రహ విగ్రహాలు, జంట నాగేంద్రస్వామి, చండీశ్వరుడు, సరస్వతీ దేవి, హరిహర మూర్తి, అర్ధనారీశ్వరుడు విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు సోమవారం ప్రకటనలో తెలిపారు. 7న గర్తపూజ, రత్నన్యాసం, ధాతున్యాసం 12.56 నిమిషాలకు యంత్ర స్థాపన, విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు రావూరి పూర్ణచంద్ర శాస్త్రి, హనుమ శాస్త్రి నేతృత్వంలో జరుగుతాయని చెప్పారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బాబా, కోటిలింగాల ఆలయం నిర్వాహకులు లక్ష్మీనారాయణలు పర్యవేక్షిస్తారన్నారు.

ఆధార్ క్యాంపును వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: ఆధార్ కార్డులు లేని 0–6 చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ఆధారంగా ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. వేములూరిపాడు అంగన్‌వాడీ సెంటర్లో సోమవారం ఆధార్ క్యాంపు ఏర్పాటు చేశారు. 13 మందికి నూతన ఆధార్ కోసం నమోదు చేశారు. 9 మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమాలను అంగన్‌వాడీ సూపర్ వైజర్ మహాలక్ష్మి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది సీహెచ్ లక్ష్మణరావు, ఎస్.గణేష్ భార్గవ్, షేక్.షబీనా బేగం పాల్గొన్నారు.

కండ్రికలో పశు ఆరోగ్య శిబిరం



ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండవ చిన నరసింహారావు ప్రారంభించారు. శిబిరంలో 12 గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. 79 పశువులకు డీవార్మింగ్ , 245 జీవాలకు షీప్ వ్యాక్సిన్ మందు వేసినట్లు చెప్పారు. శీతాకాలంలో పశువుల విషయంలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కరపత్రాలు అందజేసి వారికి వివరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పెద నరసింహారావు, టి.చంద్రయ్య, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మందకృష్ణకి పద్మశ్రీ హర్షణీయం



తాడేపల్లిరూరల్: మాదిగ రిజర్వేషన్ల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం హర్షించదగ్గ విషయమని గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పెద్దేటి యోహాను, సంస్థ గౌరవ సలహాదారు షేక్ సుభాని పేర్కొన్నారు. సోమవారం దుగ్గిరాలలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్షయ సేవా సమితి అధ్యక్షురాలు వి.మేరి సుజాత, జాషువా కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి



వరి సాగు చేసిన పొలం

తాడేపల్లిరూరల్: వ్యవసాయంలో ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేస్తే దిగుబడులు తగ్గుతాయి. చాలామంది రైతులు ఇప్పటికీ ఒకేరకమైన పంటలను పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ఏటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పంట మార్పిడిపై అవగాన అవసరం

పంట మార్పిడి విధానాన్ని అలవంబిస్తే తెగుళ్ల బెడద తగ్గుతంది. దీనిపై చాలామంది రైతులకు అవగాహన లేదు. మరొకరు వేసిన పంటనే వేస్తూ నష్టాల పాలవుతున్నారు. పంట మార్పిడి మూలంగా నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది. దీనివల్ల చీడపీడల బెడద అస్సలు ఉండదు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు. శిలీంద్ర తెగుళ్లను దూరం చేయవచ్చు. బీజాలు వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఎక్కువ అవుతుంది. కీటకాల గుడ్లు వృద్ధి చెందవు. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ధర ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

ఏడాదికి రెండు పంటలు

భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటలను సాగు చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక ఎక్కువ పంట కాలం కలిగిన కంది, వేరు శనగ వంటి పంటలు వేసుకోవాలి. బంకమన్ను శాతం ఎక్కువగా ఉండే ఎర్రనేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

> **పంట మార్పిడితో ఉపయోగాలెన్నో..**
>
> 
>
> జొన్నసాగు తర్వాత మళ్లీ అదే పంటను వేయకూడదు. దీనివల్ల ఎర్రగొంగళి, శెనగపచ్చ పురుగు ఆశించవచ్చు. పంట మార్పిడి చేయడం వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయి. మొక్కజొన్న, జొన్న పైర్లు అయిన తరువాత వంగ, టమోటా వేస్తే భూ సారానికి చాలా ఉపయోగంగా ఉంటుంది.
>
> – శిరీష, ఏఓ, దుగ్గిరాల

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి. మినుము, ఉలవలు, పెసర పంట మార్పిడితో భూసారం ఒక రకమైన పంటలు కాకుండా మార్పుచేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. వీలైనంత వరకు తెగుళ్ల బాధ తగ్గుతుంది. దీనిపై రైతులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి. పక్క పొలంలో పండించిన పంటనే తాము పండించడం మానుకోవాలి. కొత్త పంటలను ఎంపిక చేసుకోవాలి. నియోజకవర్గంలో అరటి, చేమ, పూలతోటలు, కూరగాయ తోటలు, ఇతర పంటలను పండిస్తున్నారు. ఈ పంటలు పండించేవారు భూమి లోపల పండే పంటలను వేస్తే, మరోసారి భూమిపై పండే పంటలు వేయడం వల్ల భూసారం బాగా పెరుగుతుంది. వరి పైరు తరువాత మినుము, పెసలు, మొక్కజొన్న లాంటి పంటలను వేస్తే వరి పంటకు దోమపోటు సమర్థవంతంగా నివారిస్తుంది. పెసర, పశు గ్రామం సాగుచేస్తే త్వరగా భూమి సారవంతం అవుతుంది.



వరి సాగు అనంతరం వేసిన పూలతోట

ఇళ్ల స్థలాలివ్వాలని వినతులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సచివాలయాల్లో సీపీఎం నాయకులు అడ్మిన్లకు వినతి పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2016 కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇళ్లు తొలగించిన వారికి రెండు సెంట్ల ఇంటి స్థలం, గృహ నిర్మాణ పథకం ద్వారా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్, రామయ్య కాలనీ, కృష్ణానగర్ సచివాలయం ప్రాంతం, ఉండవల్లి, కొత్తూరు తదితర సచివాలయాల ప్రాంతాల్లో పేదలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశామని తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తాడేపల్లి పట్టణ ప్రాంతంలో ఇల్లులేని పేదలందరికి ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా సీతానగరం, మహానాడు తదతర ప్రాంతాల్లో ఇల్లు తొలగించిన పేదలకు ఇప్పటికీ ఇంటి స్థలం, ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని అన్నారు. తాడేపల్లి పట్టణ, రూరల్ సీపీఎం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సచివాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

విగ్రహ ప్రతిష్టను జయప్రదం చేయండి



మంగళగిరి (తాడేపల్లిరూరల్): రైతు సంఘం నాయకుడు రావుల శివారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ పిలునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మంగళగిరి నియోజకవర్గంలోని నిరుపేదలకు అండగా నిలిస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేసిన రావుల శివారెడ్డి కాంస్య విగ్రహ ప్రతిష్ఠను ఏర్పాటు చేయడం పార్టీ శ్రేణుల్లో సంతోషాన్నిస్తోందన్నారు. చిన్ని సత్యనారాయణ పాల్గొన్నారు.

కుంచనపల్లిలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

తాడేపల్లిరూరల్: కుంచనపల్లి గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల టీడీపీ అధ్యక్షుడు అమరా సుబ్బారావు శిబిరాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో పశుపోషణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దానిలో భాగంగా పశు వర్ధకశాఖ సేవలను మరింత చేరువ చేయడానికి అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి పాడి రైతులకు మందులను ఉచితంగా అందజేశారు. వైద్యులు డాక్టర్ వై.పద్మావతి, డీడీ తెనాలి డాక్టర్ పి.శ్రీనివాసరావు, ఏడీ మంగళగిరి డాక్టర్ పి.నరేంద్రకుమార్, ఏఓ దాసెట్టి అరుణ తదితరులు పాల్గొన్నారు.


శబ్ద కాలుష్య ప్రమాణాలు పాటించండి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ప్రతి ఒక్కరూ శబ్ద కాలుష్య ప్రమాణాలను పాటించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా స్పష్టం చేశారు. సోమవారం శబ్ద కాలుష్య ప్రమాణాలపై పత్రికా ప్రకటన విడుదల చేశారు. నగర పరిధిలోని ప్రజలందరు ప్రశాంతకరమైన ప్రజల జీవనానికి ఇబ్బంది లేకుండా శబ్ద కాలుష్య ప్రమాణాలు పాటించాలని అన్నారు. పబ్లిక్ ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో 10 డిసిబుల్, ప్రైవేటు ప్రాంతాల్లో 5 డిసిబుల్ ప్రమాణాలు పాటించాలని, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కోర్టులు పరిసర ప్రాంతాల్లో 100 మీటర్లలోపు సైలెన్స్ జోన్‌గా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో శబ్దకాలుష్యం, బాణసంచా నిషేధించినట్లు వెల్లడించారు. నగర పరిధిలోని అన్ని రకాల విద్యాసంస్థలు, కర్మాగారాలు, వాణిజ్య సంస్థలు, ప్రార్థనా మందిరాలు, బహిరంగ ప్రదేశాలతో పాటు తదితర ప్రాంతాల్లో ఖచ్చితంగా శబ్ద ప్రమాణాలను పాటించాలని, పాటించని యెడల పోలీస్‌శాఖ ద్వారా చట్టపరమైన ఫెనాల్టీలు విధించనున్నట్లు ఆ ప్రకటనలో అలీమ్ బాషా పేర్కొన్నారు.

లెప్రసీ రహిత సమాజానికి భాగస్వాములు కావాలి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: లెప్రసీ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళికృష్ణ సుబ్బరాయణం పిలుపునిచ్చారు. పట్టణంలో జరుగుతున్న లెప్రసీ సర్వేలను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వేను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద కేసులను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. లెప్రసీపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి, అందె బాలచంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, దీపాల శ్రీనివాసరావు, శివగణేష్, దాసరి నాగ మల్లేశ్వరరావు, బండారు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం క్రాప గ్రామానికి చెందిన పట్టాభి అరుణ్‌కుమార్ (28)కు నాలుగు నెలల క్రితం వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయి కాపురానికి రావడంలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన తెనాలిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందగా, వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

మైనర్ బాలిక, వివాహిత అదృశ్యం

తెనాలిరూరల్: వేర్వేరు ఘటనల్లో మైనర్ బాలిక, వివాహిత అదృశ్యమవడంపై కేసులు నమోదయ్యాయి. పట్టణ గురవయ్య కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక ఆదివారం నుండి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అలానే అదే కాలనీకి చెందిన వివాహిత శైలజ అదృశ్యమైందని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్ టౌన్ పోలీసులు రెండు కేసులను సోమవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువగళానికి రెండేళ్లు పూర్తి



తాడేపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): విద్య, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకోడంతో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. మంగళగిరి నగర పరిధిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి, పార్టీ శ్రేణులకు తినిపించారు. 2023న పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లిన నారా లోకేష్ రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3,132 కి.మీ. మేర పాదయాత్ర చేశారని చెప్పారు. నాయకులు తోట పార్థసారథి, పోతినేని శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు, మున్నంగి శివశేషగిరిరావు, వల్లభనేని వెంకటరావు, తాడిబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా దర్బార్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ, రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో ఈ ప్రజాదర్బార్ జరుగనున్నదని ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

అవివాహిత ఆత్మహత్య



మాధురి (ఫైల్)

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి నగరపరిధిలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని కొత్తపేటలో నివాసముంటున్న కుర్రా మాధురి (33) సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మాధురి గత కొంతకాలం క్రితం పట్టణ నగర పరిధిలోని ఓ మెడికల్ షాపులో పనిచేసింది. ఆదివారం రాత్రి భోజనం చేసి, బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

మిర్చిలోడు వ్యాన్ బోల్తా



బోల్తాపడిన మిర్చి లోడు వ్యాన్

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు మిర్చి లోడుతో వెళ్తున్న వ్యాన్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం బోల్తా కొట్టింది. స్థానికుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన రైతులు తమ మిరపకాయలు మినీ లారీలో మార్కెట్ యార్డుకు తీసుకెళ్తున్నారు. ఫిరంగిపురంలోని బస్టాండు సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు వ్యాన్ టైరు పేలిపోయింది. దీంతో లారీ అదుపుతప్పి పక్కకు పడిపోయింది. అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయ్యింది. లారీలో ప్రయాణిస్తున్న రైతులకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాన్ని పక్కకు పెట్టించారు.

సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరధిలోని మహిళా సంఘం నాయకురాలు బూరుగ సరస్వతి సంస్మరణ సభను పట్టణ నాయకుడు వేముల దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాసరావు పలువురు నాయకులతో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరస్వతి మహిళా ఉద్యమంలో కీలకపాత్ర వహించారని తెలిపారు. ఏ ఆశయ సాధన కోసం అయితే సరస్వతి పనిచేసిందో అదే స్పూర్తితో ప్రతి కార్యకర్త పని చేయాలని అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు, ఎంబీవికే కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, బూరుగ వెంకటేశ్వరరావు, జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టే కరుణాకరరావు, బొందలపాటి ప్రభాకరరావు, ఎ.జగన్, కోట బాబూరావు, వి.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : నేడు విజయవాడలో జరుగనున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం తాడేపల్లి నాయకులు సోమవారం పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి బైపాస్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర చైర్మన్‌గా రుద్రకోటి సదాశివమ్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేయనున్నారని, మంగళగిరి నియోజకవర్గం నుంచి నాయీ బ్రాహ్మణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పతకమూరి రామకోటేశ్వరరావు, చందర్లపాటి విజయ్, యాదవ అంకమ్మరావు, అద్దేపల్లి నాగరాజు, నాని, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

'సంక్షేమం'లో చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

అనంతవరం(తాడికొండ): ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చిన సీఎం చంద్రబాబు నేడు సంక్షేమ పథకాలు అమలు చేయలేక చేతులెత్తేయడం హాస్యాస్పదమని తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పేర్కొన్నారు. సోమవారం తుళ్లూరు మండలం అనంతవరం, పెదపరిమి గ్రామాల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. సమన్వయకర్త వజ్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, చిన్నపాటి విభేదాలను పక్కనబెట్టి ముందుకు నడవాలని సూచించారు. త్వరలో పార్టీ మండల, గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియ అందరి ఆమోదంతో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఏకాభిప్రాయంతో అందరూ పార్టీకి అంకిత భావంతో పనిచేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందని, ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీని బలోపేతం చేసేందుకు తమవంతు సహకారం అందించాలని సూచించారు. చెప్పిన మాటకు కట్టుబడి కూటమి ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని, లేదంటే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, చుండు వెంకటరెడ్డి, దాసం వినోద్, అనంతవరం నాయకులు సుంకర శ్రీనివాసరావు, ఆరేపల్లి జోజి, శానం ముక్కంటి, ఆరేపల్లి రవి, గోపీ, సాంబయ్య, పెదపరిమి గ్రామ నాయకులు నంబూరు రఘునాధరావు, ఉమా మహేశ్వరరావు, లక్ష్మీ నారాయణ రెడ్డి, పుట్టి సుబ్బారావు, దావులూరి పోతురాజు, మున్నంగి కోటిరెడ్డి, అక్కల లక్ష్మీనారాయణ రెడ్డి, భాష్యం శ్రీనివాసరావు, కె.బాబు, జి.నరసింహారావు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

భార్యాభర్తల మధ్య వివాదం

తెనాలిరూరల్: స్వల్ప వివాదం నేపథ్యంలో భార్యకు నిప్పంటించబోయిన భర్తపై కేస నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోపల్లెకు చెందిన రమావత్ రవి తన ఆటోను కుదువ పెట్టి రావడంతో భార్య శ్రీదేవి ప్రశ్నించింది. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఇంట్లో ఉన్న టర్పెంటైన్ ఆయిల్‌ను భార్య, కుమార్తెపైకి చల్లాడు. నిప్పంటించబోగా, కుమార్తె తప్పించుకుంది. శ్రీదేవికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్ కుమార్ తెలిపారు.